తగ్గిన ఆదాయం.. పెరిగిన ఖర్చులు

- **ఐదు నెలల్లో రాష్ట్ర ఆర్థికం అస్తవ్యస్తం**
- **హైడ్రా భయంతో భారీగా తగ్గుదల**
- **మొత్తం వసూళ్లు రూ.91,085.54 కోట్లు**
- **మొత్తం వ్యయం రూ.85,467.75 కోట్లు**
- **కాగ్ నెలవారీ నివేదికల గణాంకాల్లో వెల్లడి**

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. 2024-25 ఆర్థిక సంవత్సరం మొదటి ఐదు నెలల్లో తెలంగాణ ఆర్థిక పరిస్థితి తీవ్ర సంక్షోభానికి గురైంది. పన్నుల ఆదాయం తగ్గడంతోపాటు ఖర్చులు పెరగడంతో ఆర్థిక వ్యవస్థ అష్టకష్టాలను ఎదుర్కొంటున్నది. వాస్తవ ఆదాయాలు 27.85 శాతం ఉండగా, ఆదాయ ఖర్చులు రూ.34.91 శాతానికి పెరిగాయి. 2024 ఆగస్టు నెల కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక ఆధారంగా.. రాష్ట్రం మొత్తం ఆదాయం రూ.91,085.54 కోట్లు కాగా, మొత్తం ఖర్చులు 85,467.75 కోట్లుగా నమోదయ్యాయి. రాష్ట్ర రెవెన్యూ రాబడులు రూ.61,618.60 కోట్లు, మూలధన వసూళ్లు రూ.29,466.94 కోట్లు వచ్చాయి. రెవెన్యూ వ్యయం రూ.77,140.22 కోట్లు, మూలధన వ్యయం మొత్తం రూ.8,327.53 కోట్లుగా అంచనా వేయబడింది. 2024 ఆగస్టు చివరి నాటికి రెవెన్యూ లోటు రూ.15,521.62 కోట్లకు చేరగా, ఆర్థిక లోటు రూ.29,449.94 కోట్లకు పెరిగింది. ఈ గణాంకాలు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సంక్షోభాన్ని సూచిస్తున్నాయి. రాష్ట్ర బడ్జెట్‌లో పేర్కొన్న వార్షిక లక్ష్యంలో ఐదు నెలల కాలానికి మొత్తం వసూళ్లు 33.24 శాతం కాగా, వ్యయం మాత్రం 33.59 శాతమని కాగ్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వార్షిక లక్ష్యంలో వాస్తవ రాబడులు 27.85 శాతం రాగా, వ్యయం 34.91 శాతంగా నమోదైంది. మూలధన వసూళ్ల లక్ష్యంలో 55.79 శాతానికి ఎగబాకగా, మూలధన వ్యయం 24.87 శాతం వద్ద తక్కువగా నమోదైంది.

ఖర్చులెక్కువ.. ఆదాయం తక్కువ

వడ్డీ చెల్లింపులు, ఉద్యోగుల జీతాలు, వేతనాలు, పెన్షన్లు, సబ్సిడీపై ఖర్చుల కారణంగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కచ్చిత వ్యయం వార్షిక అంచనాల కంటే గణనీయంగా పెరిగింది. వడ్డీ చెల్లింపులు రూ.10,497.52 కోట్లకు (వార్షిక అంచనాల్లో 59.21%) పెరిగాయి. వేతనాలు రూ.18,152.28 కోట్లకు (45.33%), పింఛన్లు రూ.7,165.65 కోట్లకు (61.55%) పెరిగాయి. రాష్ట్ర నికర రుణాలు, ఇతర రుణ బాధ్యతలు రూ.29,466.94 కోట్లకు (అంటే, వార్షిక అంచనాలలో 59.79%) పెరిగాయి. 2023 డిసెంబర్ నుంచి 2024 మార్చి వరకు గత ఆర్థిక సంవత్సరంలో నికర రుణాలు 11,438.04 కోట్లు కాగా, ప్రస్తుతం 2024-25లో తొలి ఐదు నెలల్లో నికర రుణాలు 29,499.94 కోట్లకు చేరడంతో మొత్తం రుణభారం రూ.40,887.98 కోట్లకు పెరిగింది.

బడ్జెట్ లక్ష్యాలను చేరుకోవడం అనుమానమే..

రాష్ట్రంపై రుణభారం పెరిగిన నేపథ్యంలో మిగిలిన ఆర్థిక సంవత్సరంలో ఆదాయ, ఖర్చుల లక్ష్యాలను చేరుకోవడం అనుమానం గోచరిస్తున్నది. ఎందుకంటే ఆదాయాలను పెంచుకోవడంతోపాటు ఖర్చులనూ తగ్గించుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే పెట్రోలియం ఉత్పత్తులు, మోటర్ వాహన పన్ను, స్టాంప్ డ్యూటీ, ఇతర పన్నులు భారీగానే ఉన్నాయి. వాటిని పెంచడం సాధ్యపడకపోవచ్చు. మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు.. రాష్ట్ర ఆదాయంపై హైడ్రా ప్రతికూల ప్రభావం చూపుతున్నది. స్టాంప్స్, రిజిస్ట్రేషన్ పన్నుల ఆదాయాలు భారీగా తగ్గాయి.

2024లో ఐదు నెలల (ఏప్రిల్-ఆగస్టు) రాష్ట్ర ఆర్థిక పరిస్థితి

- **మొత్తం ఆదాయం:** 91,085.54 కోట్లు (వార్షిక లక్ష్యానికి 33.24%)
- **మొత్తం ఖర్చులు:** 85,467.75 కోట్లు (వార్షిక లక్ష్యానికి 33.59%)
- **ఆదాయ లోటు:** 15,521.62 కోట్లు
- **ఆర్థిక లోటు:** 29,449.94 కోట్లు
- నికర రుణాలు, ఇతర బాకీలు: 29,466.94 కోట్లు (వార్షిక అంచనాలకు 59.79%)
- **పన్ను ఆదాయాలు:** జీఎస్టీ, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు, వ్యాట్, రాష్ట్ర ఎక్సైజ్ డ్యూటీలు సహా పన్ను ఆదాయాలు రాష్ట్ర వార్షిక లక్ష్యానికి 35.11 శాతం తక్కువగా నమోదైంది.
- పన్నుయేతర ఆదాయాలు 4.12 శాతమే వసూలయ్యాయి. వార్షిక లక్ష్యం రూ.1,449.54 కోట్లకు వసూలైంది రూ.35,208.44 కోట్లు మాత్రమే.

'పొంగులేటి' డాటాపై ఈడీ విశ్లేషణ

ఐదు రకాల ఆర్థిక నేరాలపై లోతైన పరిశీలన

రెండ్రోజుల సోదాల్లో కీలక డాక్యుమెంట్లు, పలు దస్త్రాలు, డిజిటల్ సామగ్రి స్వాధీనం

- **పట్టుబడిన డబ్బు ఎలా వచ్చింది? ఎక్కడికి వెళ్తున్నదన్న అంశాలపై ఆరా**
- **తనయుడి క్రిప్టో ఖాతాలు, లావాదేవీలపైనా దృష్టి**
- **'లీకు వీరుల'ను పట్టుకునేందుకు ప్రత్యేక బృందం**
- **ఈడీ అధికారిక ప్రకటనపై సర్వత్రా ఆసక్తి**



హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఆయన కుటుంబసభ్యులు, బంధువుల ఇండ్లలో రెండ్రోజులుగా ఢిల్లీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు జరిపిన సోదాల్లో మొత్తం ఐదు రకాల ఆర్థిక నేరాలు, రూ.వందల కోట్ల లావాదేవీలు, క్రిప్టో ఖాతాల వివరాలు వెలుగులోకి రావడంతోపాటు భారీగా డబ్బు, ఎన్నో కీలక డాక్యుమెంట్లు, డిజిటల్ సామగ్రి పట్టుబడినట్టు తెలుస్తున్నది. దీంతో వాటిపై అధికారులు లోతైన విశ్లేషణ చేస్తున్నారు. ఇంత భారీగా అక్రమ లావాదేవీలు ఎలా జరిగాయి? ఎందుకు జరిగాయి? పట్టుబడిన డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? ఎక్కడికి తరలించబోతున్నారన్న వివరాలతోపాటు ఎగ్జిమ్ బ్యాంక్ గ్యారెంటీలు, పన్ను ఎగవేతలు, ప్రాజెక్టులకు నిధుల మళ్లింపు, వాచీల స్మగ్లింగ్, మనీలాండరింగ్ తదితర అంశాలపై ఈడీ అధికారులు ఆరా తీస్తున్నట్టు తెలిసింది.

ఆ లీకు వీరులు ఎవరు?

కేంద్ర రెవెన్యూ ఇంటెలిజెన్స్ విభాగంలోని ఐఎఫ్‌యూతోపాటు చెన్నైలోని కస్టమ్స్, ఐటీ అధికారులు ఇచ్చిన పక్కా నివేదికల ఆధారంగా హైదరాబాద్‌లో సోదాలు నిర్వహించేందుకు ఢిల్లీ నుంచి ఈడీ బృందం రాబోతున్నదన్న విషయం ముందుగానే బయటకు పొక్కినట్టు తెలుస్తున్నది. గురువారం అర్ధరాత్రే ఈ సమాచారం లీక్ కావడంతో శుక్రవారం ఉదయమే మంత్రి పొంగులేటితోపాటు ఆయన కుటుంబసభ్యులు, బంధువుల ఇండ్లు, కార్యాలయాల నుంచి పలు కీలక ఫైళ్లను వేరేచోటికి తరలించినట్టు సమాచారం. దీంతో ఆయా ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్న ఈడీ అధికారులు.. తమ సోదాల విషయాన్ని ముందుగానే లీక్ చేసినవారిపై కూడా దృష్టి సారించారు. ఆ లీకు వీరులను పట్టుకునేందుకు ఏకంగా ఓ ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దించినట్టు తెలిసింది.

మిస్సయిన కీలక ఫైళ్ల కోసం ఈడీ ఆరా

శుక్రవారం ఉదయం బంజారాహిల్స్‌లోని మంత్రి పొంగులేటి బంధువుల ఆఫీసుల నుంచి భారీ మొత్తంలో డబ్బుతోపాటు పలు కీలక ఫైళ్లు, అనేక దస్త్రాలు, సీపీయూలు, కంప్యూటర్ హార్డ్‌డిస్క్‌లు, ఇతర డిజిటల్ సామగ్రిని రెండు ఇన్నోవా కార్లలో రహస్య ప్రాంతానికి తరలించినట్టు తెలుస్తున్నది. దీంతో వాటిని ఎక్కడికి తరలించారన్న దానిపై ఢిల్లీ ఈడీ అధికారులు దృష్టి సారించడంతోపాటు 'నమస్తే తెలంగాణ' ప్రచురించిన కథనాలపై హైదరాబాద్ ఈడీ అధికారులతో మాట్లాడినట్టు సమాచారం.

తనయుడి క్రిప్టో ఖాతాలపై నజర్

ఖరీదైన వాచ్‌ల స్మగ్లింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తనయుడు హర్షారెడ్డి క్రిప్టో ఖాతాలపై కూడా ఈడీ అధికారులు దృష్టిసారించినట్టు తెలిసింది. 'టెథర్' అనే క్రిప్టో వాలెట్ ద్వారా హర్షారెడ్డి భారీగా అక్రమ లావాదేవీలు జరిపినట్టు ఈడీ అధికారుల దృష్టికి రావడంతో అసలు ఆయనకు ఎన్ని రకాల క్రిప్టో అకౌంట్లు ఉన్నాయి? వాటి ద్వారా ఎన్ని లావాదేవీలు జరిగాయి? వాటిలో వాచీల స్మగ్లింగ్‌కు సంబంధించిన లావాదేవీలు ఎన్ని ఉన్నాయి?, ఈ లావాదేవీలకు స్థానిక క్రిప్టో హవాలా వ్యాపారులు ఎవరైనా సహకరించారా? అనే వివరాల కోసం కూపీ లాగుతున్నారు. కాగా, గత రెండ్రోజుల సోదాల్లో పట్టుబడిన డబ్బు, డాక్యుమెంట్లు, డిజిటల్ సామగ్రి, క్రిప్టో వ్యాలెట్ల వివరాలను ఈడీ అధికారులు సోమవారం లేదా మంగళవారం అధికారికంగా వెల్లడించనున్నట్టు తెలుస్తున్నది.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఎం రేవంత్, పీఏసీ చైర్మన్ గాంధీ

మహిళల ఆరోగ్య సంరక్షణకు కృషి: సీఎం రేవంత్ రెడ్డి

మాదాపూర్, సెప్టెంబర్ 29: మహిళల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలి స్టేడియంలో బ్రెస్ట్ క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆదివారం సుధారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'పింక్ పవర్ రన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రేవంత్‌రెడ్డి పీఏసీ చైర్మన్ ఆరికెపూడి గాంధీతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. మహిళల ఆరోగ్యం, సంక్షేమం కోసం రాష్ట్రంలో మరిన్ని దవాఖానాలు నిర్మిస్తామని చెప్పారు. పక్షి ఆకృతిలో అతిపెద్ద మానవహారంగా ఏర్పడిన వలంటీర్లను అభినందించారు. ఇందులో భాగంగా 2కే, 5కే, 10కే రన్ నిర్వహించగా విజేతలకు బహుమతులు అందజేశారు.

హర్యానా ఎన్నికలకు హైదరాబాద్ సొమ్ము!

- **రూ.650 కోట్లు తరలించేందుకు రంగం సిద్ధం**
- **ఇప్పటికే హవాలా ద్వారా 100 కోట్లు తరలింపు**
- **కేంద్ర నిఘా వర్గాలకు ఇప్పటికే సమాచారం**
- **ఆ నేపథ్యంలోనే ఈడీ, ఐటీ, డీఆర్ఐ సోదాలు**

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (హైదరాబాద్): త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న హర్యానాకు తెలంగాణ నుంచి భారీగా నగదు తరలింపు జరుగుతున్నట్టు కేంద్ర నిఘా వర్గాలకు ఉప్పందింది. ఈ మేరకు రంగంలోకి దిగిన ఐటీ, ఈడీ, డీఆర్ఐ బృందాలు కొన్నిరోజులుగా అనుమానిత వ్యక్తులు, వారికి చెందిన సంస్థల్లో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నాయి. హైదరాబాద్ నుంచి మహారాష్ట్ర మీదుగా హర్యానాకు రూ.650 కోట్ల నగదు తరలింపునకు రంగం సిద్ధమైందని, ఇందులో ఇప్పటికే రూ.100 కోట్ల వరకు కొన్ని సూట్‌కేస్ కంపెనీలు, హవాలా వ్యాపారుల ద్వారా హర్యానాకు చేరవేశారని ఫైనాన్స్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ పసిగట్టినట్టు సమాచారం. పొరుగు రాష్ట్రంలోని ఓ ఎలక్ట్రికల్ లిస్టెడ్ కంపెనీ ప్రతినిధుల ద్వారా ఈ హవాలా డబ్బును సర్దుబాటు చేసినట్టు గుర్తించారని తెలిసింది.

10 ప్రాంతాల్లో రహస్యంగా సోదాలు వచ్చే నెల 5వ తేదీన హర్యానాలో ఎన్నికలు ఉన్నాయి. ఆ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఓ జాతీయ పార్టీ కోసం తెలంగాణ ప్రభుత్వంలోని పలువురు పెద్దలు ఈ నిధులను సమీకరించారని, ఆ సొమ్మును హైదరాబాద్‌లోని పలుచోట్ల దాచి ఉంచారని, ఆ డబ్బును తరలించే బాధ్యతను ఒకరిద్దరు నేతలకు అప్పగించారని కేంద్ర నిఘావర్గాలకు సమాచారం అందింది. ఈ విషయం కేంద్ర నిఘా వర్గాల దృష్టికి రావడంతో ఆ సమాచారాన్ని ఈడీ, ఐటీ విభాగాలకు అందజేశారు. దీంతో ఆ రెండు విభాగాలకు చెందిన పలువురు అధికారులు రాష్ట్ర పోలీసులకు సమాచారం ఇవ్వకుండానే దాడులు జరిపినట్టు తెలుస్తున్నది. హైదరాబాద్‌లో శుక్రవారం 8 చోట్ల, శనివారం మరో రెండు చోట్ల ఈ తనిఖీలు చేపట్టారు. అతిరహస్యంగా ఈ దాడులు సాగినట్టు తెలుస్తున్నది.

పొంగులేటిపై దాడులు నిఘా వర్గాల సమాచారంతోనేనా?

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఆయన కుటుంబసభ్యులు, బంధువుల ఇండ్లు, కార్యాలయాల్లో గత రెండ్రోజులపాటు జరిపిన సోదాలు కేంద్ర నిఘావర్గాల సమాచారం మేరకేనని భావిస్తున్నారు. అయితే సోదాల్లో ఏం గుర్తించారనేది ఈడీ బృందాలు ఇంతవరకు అధికారికంగా వెల్లడించలేదు. దీంతో పలురకాల అంశాలు విస్తృతంగా ప్రచారమవుతున్నాయి. ఈ సోదాల్లో 6 బ్యాగులతోపాటు 2 గోనె సంచుల్లో భారీగా డబ్బు పట్టుబడినట్టు జోరుగా ప్రచారం జరుగుతున్నది. అయితే, ఇదంతా బూటకపు ప్రచారమని, కాంగ్రెస్ పార్టీ అంతర్గత కుమ్ములాటల్లో భాగంగా మంత్రి పొంగులేటి పేరును బయటకు తీసుకొచ్చారన్న చర్చ కూడా రాజకీయ వర్గాల్లో సాగుతున్నది. కేంద్ర నిఘా వర్గాలు స్పష్టంగా వెల్లడిస్తే తప్ప, ఈ ఊహాగానాలకు తెరపడేలా కనిపించడం లేదు.

మా ఇండ్లే దొరికాయా... డబుల్ లబ్ధిదారుల ఆందోళన

ఆందోళన చేస్తున్న డబుల్ బెడ్రూం ఇండ్ల బాధితులను చెదరగొడుతున్న పోలీసులు

సైదాబాద్, సెప్టెంబర్ 29 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తమకు కేటాయించిన డబుల్ బెడ్రూం గృహాలను మూసీ బాధితులకు కేటాయించడం ఎంత వరకు సమంజసమని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల మూసీ పరివాహక ప్రాంతంలో హైడ్రా కూల్చివేతలు చేపట్టగా, ప్రభుత్వం వారికి సైదాబాద్‌లోని పిల్లిగుడిసెల డబుల్‌బెడ్రూం గృహాలను కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. విషయాన్ని తెలుసుకున్న స్థానికులు ఆదివారం రాత్రి అక్కడికి చేరుకొని ఆందోళనలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో కొత్తగా వచ్చిన వారి మధ్య గొడవ కాస్త ఉద్రిక్తంగా మారడంతో మాదన్న పేట పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

కులగణన చేపట్టాల్సిందే

- **ఆ తరువాతే వర్గీకరణ అమలుచేయాలి: వెంకటేశం**

హైదరాబాద్, సెప్టెంబర్29 (నమస్తే తెలంగాణ): ముందుగా ఎస్సీ కులగణన చేపట్టాలని, ఆ తర్వాతే వర్గీకరణ అమలుచేయాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటివరకు ఎస్సీ రిజర్వేషన్ల ద్వారా ఎక్కువగా మాల, మాదిగలే లబ్ధిపొందారని, ఇతర వెనుకబడ్డ 57ఉపకులాలు తీవ్రంగా నష్టపోయాయని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న కులాలు, ఇప్పుడు తెలంగాణలో లేవని, ఎస్సీల సమగ్ర కులగణన నిర్వహిస్తేనే ఆయా కులాల ఆర్థిక, సామాజిక స్థితిగతులు తెలుస్తాయని తెలిపారు. ఇప్పటివరకు జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీలుగా గణిస్తున్నారే తప్ప.. ఉపకులాల వివరాలు, సామాజిక, ఆర్థిక స్థితిగతులకు ప్రాధాన్యమివ్వడం లేదని నొక్కిచెప్పారు. ప్రస్తుతం 2011 జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం వర్గీకరణ అమలుకు సమాలోచనలు చేస్తుందనే వార్తలు వినిపిస్తున్నాయని, అదే నిజమైతే ఉపకులాలకు మరోసారి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

పోలీసుల పొట్టగొడుతున్న ప్రభుత్వం

- **పెండింగ్‌లో 5 డీఏలు, సరెండర్లు, టీఏలు**
- **అతీగతీ లేని పీఆర్సీ ఏరియర్స్, జీపీఎఫ్, వైద్యబిల్లులు**
- **దవాఖానల్లో పనిచేయని ఆరోగ్య భద్రతా కార్డులు?**
- **ఒక్కో పోలీసుకు సర్కారు బాకీ రూ.3 లక్షలపైనే!**
- **ప్రమోషన్లకూ నోచని ఎందరో కానిస్టేబుళ్లు**

యూసఫ్‌గూడ ఫస్ట్ బెటాలియన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఏఆర్ ఎస్సై జనార్దన్‌రావుకు మొన్న అర్ధరాత్రి 2 గంటలకు గుండెపోటు వచ్చింది. కుటుంబసభ్యులు సోమాజిగూడలోని ఓ ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ ఈసీజీ తీసి అడ్మిషన్ కోసం వివరాలు అడిగారు. కుటుంబసభ్యులు పోలీసు ఆరోగ్య భద్రతా కార్డు చూపడంతో వెంటనే ఇక్కడ బెడ్లు ఖాళీలేవు. ఎక్కడికైనా తీసుకెళ్లండని తెగేసి చెప్పారు. అప్పటికే మ్యాసివ్ స్ట్రోక్ రావడం, చేతిలో డబ్బుల్లేక, మరో చిన్నపాటి ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లారు. అప్పటికే సమయం మించిపోయి జనార్దన్ చనిపోయారు.

ఖమ్మం జిల్లాకు చెందిన ఆనందరావు (పేరు మార్చాం)కు 15 ఏండ్ల క్రితం కానిస్టేబుల్‌గా ఉద్యోగం వచ్చింది. నేటికీ కానిస్టేబుల్‌గానే విధుల్లో కొనసాగుతున్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన 5 డీఏలు, మూడు సరెండర్లు పెండింగ్‌లో ఉన్నాయి. పీఆర్సీ ఎరియర్స్ అతీగతీ లేదు. బ్యాంకు నుంచి రుణం తీసుకొని, కొంత అప్పుచేసి ఇల్లు పని మొదలుపెట్టాడు. ఇన్నాళ్లూ సలాం చేసిన చుట్టుపక్కల వాళ్లు ఆయన అప్పులభారం చూసి మర్యాద ఇవ్వడమే మానేశారు. పిల్లల చదువులు, వారి ఫీజులు, ఇంటి ఖర్చులకు తోడు సొంత డబ్బుతో బందోబస్తుకు వెళ్తుండటంతో బతుకే భారమైంది.

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): ఈ రెండు ఉదంతాలు రాష్ట్రంలోని ఏ ఒక్క జనార్దన్‌రావు, ఆనందరావు దుస్థితో కాదు.. తెలంగాణలోని 50 వేల మంది కానిస్టేబుళ్ల మానసిక వ్యథ. బయట చేయిచాచి అడుక్కోలేని పోలీసు అధికారులందరి దీనస్థితి. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే తమ బతుకులు మారుతాయని ఎంతో ఆశపడ్డారు. పెండింగ్ డీఏలు, టీఏలు, పీఆర్సీ ఎరియర్స్, సరెండర్లు, జీపీఎఫ్, మెడికల్ బిల్లుల చెల్లింపుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం తాత్సారం చేస్తున్నది. దీంతో దీంతో అష్టకష్టాలు పడుతున్నారు. కానిస్టేబుల్ నుంచి పైస్థాయి అధికారి వరకూ రావాల్సిన 5 డీఏలు నేటికీ పెండింగ్‌లో ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కొన్నిచోట్ల ఒకట్రెండు సరెండర్లు విడుదల చేసినా.. ఉపయోగం లేకుండాపోయింది. ఓ జిల్లాలో 3,000 మంది సిబ్బంది ఉంటే.. కేవలం 30 నుంచి 40 మందికి మాత్రమే సరెండర్లు పడ్డాయి. మిగతవారు తమకెప్పుడు సరెండర్ నిధులు విడుదలవుతాయా అని వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. కొన్ని జిల్లాలకు ఆ ఒక్క సరెండర్ ఊసే లేదు. గత పీఆర్సీ ఆమోదించిన అడిషనల్ హెచ్ఎస్ఏ, రేషన్ అలవెన్స్, కిట్ మెయింటెనెన్స్, రిస్క్ అలవెన్స్, డ్రైవర్ అలవెన్స్, ట్రైనింగ్ సెంటర్స్ అలవెన్సు ఇలా చాలా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వాపోతున్నారు. కానిస్టేబుల్ నుంచి పైస్థాయి అధికారి వరకూ సగటున ఒక్కొక్కరికీ సుమారు రూ.3 లక్షల వరకు ప్రభుత్వం తమకు బాకీ ఉన్నదని ఆ ఉద్యోగ వర్గాల సమాచారం.

కష్టాల కడలిలో తప్పని ఎదురీత

పేరుకు పోలీసు ఉద్యోగమైనా ఏ ఒక్కరిని కదిలించినా కన్నీటి కష్టాలే చెప్పుకుంటున్నారు. ఒక్కో పోలీస్ అధికారికి సగటున ఒక

సరెండర్ కింద సుమారు రూ.30 వేల నుంచి 50 వేలు రావాల్సి ఉంటుంది. సీనియార్టీ ఉంటే సుమారు రూ.70 వేల నుంచి రూ.80 వేల వరకు రావాల్సి ఉంటుంది. అవి ఎప్పుడో వస్తాయో తెలియదు. 2003 కంటే ముందు పోలీస్ ఉద్యోగానికి ఎంపికైన వారికి జీపీఎఫ్ కింద పిల్లల చదువులు, పెండ్లిళ్లు, ఇంటి ఖర్చు, ఆరోగ్య అవసరాలకు కోసం బిల్లులు పెట్టుకున్నా పట్టించుకునే దిక్కేలేదు. ఆరోగ్య భద్రత నుంచి దవాఖానలకు చెల్లించాల్సిన బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో పోలీసులకు చికిత్స చేయడానికి దవాఖానలు నిరాకరిస్తున్నాయి. సొంత డబ్బుతో బందోబస్తుకు వెళ్తే.. టీఏలు ఇవ్వని దుస్థితి. వీటికి తోడు పెరిగిన ధరలతో సగటు కానిస్టేబుల్ కుటుంబం నెల గడిపేందుకు తీవ్రంగా సతమతమవుతున్నది. ఎస్సై ర్యాంకు కంటే కింది స్థాయి వారిది దారుణమైన పరిస్థితి. దుర్భరమైన జీవితం అనుభవిస్తున్నామని కన్నీటి పర్యంతమవుతున్నారు.

బతుకమ్మ, దసరా పండుగలు జరుపుకునేది ఎట్లా?

కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులకు పెండింగ్ బిల్లులు చెల్లించకుండా కఠినంగా వ్యవహరిస్తుండటంతో పోలీస్ వర్గాలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నాయి. వచ్చే వేతనం నెలారంభంలోనే ఖర్చవుతుండటంతో మిగతా రోజులు గడిచేందుకు నానా అవస్థలు పడుతున్నామని ఎందరో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బతుకమ్మ, దసరా పండుగలను జరుపుకునేది ఎట్ల అని దీనంగా ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ సర్కార్.. మానవీయ కోణంలో పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని వారు కోరుతున్నారు. ఎప్పట్నుంచో పెండింగ్‌లో ఉన్న 'వారాంతపు సెలవు'ను మంజూరు చేయాలని, ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు కల్పించాలని, పోలీసు ఆరోగ్య భద్రతా కార్డుపై చికిత్సలు వెంటనే చేసేందుకు దవాఖానలకు ఆదేశాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే రోడ్డెక్కాల్సిన పరిస్థితి రావొచ్చని హెచ్చరిస్తున్నారు.

మంత్రి ఉత్తమ్‌కు పితృ వియోగం

- **వృద్ధాప్యం, అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన పురుషోత్తంరెడ్డి**
- **భౌతికకాయానికి నివాళులర్పించిన మాజీ మంత్రి హరీశ్‌రావు**

అనారోగ్యంతో మృతి చెందిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 29(నమస్తే తెలంగాణ)/మాదాపూర్: నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తండ్రి సలమడ పురుషోత్తంరెడ్డి(82) కన్నుమూశారు. వృద్ధాప్యంతోపాటు అనారోగ్య కారణాలతో కొంతకాలంగా బాధపడుతున్న ఆయన ఆదివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. భౌతికకాయాన్ని కొండాపూర్‌లోని సైబర్ మీడోస్‌లోని ఆయన కుమార్తె ఇంటికి తరలించారు. పురుషోత్తంరెడ్డి ఆర్సీపూర్‌లోని బీహెచ్ఈఎల్‌లో జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహించి రిటైర్డ్ అయ్యారు. సాయంత్రం జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించారు. మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్, ఏపీ పీసీసీ చీఫ్ షర్మిలతోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ప్రముఖులు పురుషోత్తంరెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకుముందు మహాప్రస్థానానికి చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆయన భౌతికకాయానికి నివాళులర్పించి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని పరామర్శించారు.

కేటీఆర్ సంతాపం

రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి నలమాద పురుషోత్తమ్‌రెడ్డి మృతికి కేటీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించినట్టు పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు కేటీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

బీసీ బంధు ఏమాయె?

కేసీఆర్ హయాంలో లక్ష ఆర్థిక సాయం

తొలి విడతలో 40 వేల మందికి పంపిణీ

- **ఇంకా జాబితాలో 3.60 లక్షల అర్హులు**
- **అవన్నీ పక్కన పడేసిన కాంగ్రెస్ సర్కార్**
- **4 వేల కోట్లతో అధికారుల ప్రతిపాదనలు**
- **కేటాయించిన బడ్జెట్ రూ.750 కోట్లే**
- **పైసా విడుదల చేయని ప్రభుత్వం**
- **ఎక్కడా కనిపించని యాక్షన్ ప్లాన్**

హైదరాబాద్, సెప్టెంబర్4 (నమస్తే తెలంగాణ): కులవృత్తుల వారిని ఆదుకునేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలుచేసిన బీసీబంధు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించింది. మరేదైనా పథకం ద్వారా ఆదుకుంటుందా? అంటే అలాంటి ఊసే ఎత్తడం లేదు. కార్పొరేషన్ ద్వారా రుణాల పంపిణీకి దాదాపు రూ.4 వేల కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపగా, ప్రభుత్వం రూ.750 కోట్లు మాత్రమే కేటాయించింది. ఆ నిధులను కూడా విడుదల చేయలేదు. రాష్ట్రంలోని బీసీ కులవృత్తులు, చేతివృత్తుల బలోపేతానికి, వృత్తిదారులు ముడిసరుకులు, యంత్ర పరికరాల కొనుగోలుకు 100% సబ్సిడీతో రూ.లక్ష ఆర్థికసాయం అందించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ బంధు పథకాన్ని ప్రవేశపెట్టగా, 5,28,862 దరఖాస్తులు వచ్చాయి. అందులో 4.13 లక్షల మందికి అర్హులున్నట్టు గుర్తించారు. వీరిలో 40 వేల మంది కులవృత్తిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందజేసింది. మిగిలిన వారికి ప్రతి నెలా 15న ఆర్థికసాయం అందించాలని, అది నిరంతరం కొనసాగించాలని అప్పటి సర్కార్ నిర్ణయించింది. అయితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆయా దరఖాస్తులను పక్కనపెట్టినట్టు తెలిసింది. పథకానికి నిధుల విడుదల వద్దని అధికారులకు సూచించినట్టు సమాచారం.

4 వేల కోట్లతో ప్రతిపాదనలు

కాంగ్రెస్ ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు బీసీబంధు పథకాన్ని పూర్తిగా పక్కనపెట్టిన బీసీ సంక్షేమశాఖ ఉన్నతాధికారులు.. గతంలో మాదిరిగా 60, 70, 80% సబ్సిడీతో రుణాలు ఇవ్వాలని ప్రణాళికలు రూపొందించారు. గతంలో 2015, 2019లో బీసీ సంక్షేమశాఖ సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తులు స్వీకరించింది. అందులో 60% సబ్సిడీ రుణాల కోసం దాదాపు రెండు లక్షల మందికిపైగా, 70% సబ్సిడీ రుణాల కోసం 1.50 లక్షల మందికిపైగా, 80% సబ్సిడీ రుణాల కోసం లక్ష మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. అనివార్య కారణాలతో దరఖాస్తుదారులకు రుణాలను మంజూరు చేయలేదు. గతంలో వివిధ సబ్సిడీల కింద రుణాలకు దరఖాస్తు చేసుకున్నవారికే ప్రస్తుతం రుణాలను ఇచ్చేందుకు ప్రణాళికలను రూపొందించినట్టు తెలుస్తున్నది. బీసీ సంక్షేమశాఖ ఇటీవల బీసీ కార్పొరేషన్ కింద సబ్సిడీ రుణాల కోసం రూ.4వేల కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ప్రభుత్వం బడ్జెట్‌లో కేవలం రూ.750 కోట్లు కేటాయించింది. వాటిని కూడా విడుదల చేయకపోవడంతో ఏవిధంగా యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేయాలో తెలియక అధికారులు సతమతమవుతున్నారు. ప్రభుత్వం కేటాయించిన నిధులైనా విడుదల చేస్తుందా? అందులోనూ కోత పెడుతుందా? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో ఎంతమందికి రుణాలు మంజూరు చేయాలనే అంశంపై తర్జనభర్జన పడుతున్నారు.

మెట్రో.. వంకర టింకర

మొదటిపేజీ తరువాయి...

ఉంటుందని చెప్పిన అధికారులు, దాన్ని 116 కి.మీ మేర పెంచినట్టు ప్రకటించారు. దాంతోపాటే రెండో దశ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.32,237 కోట్లు అవుతుందని పేర్కొన్నారు. అంతకు ముందు రెండో దశ మెట్రోకు రూ.20వేల కోట్లు అంచనా వేసిన అధికారులు, కొత్తగా ఫోర్త్ సిటీ మెట్రో కారిడార్‌తో కలిపి తాజా అంచనాలను రూ.32వేల కోట్లకు పెంచారు. ఇలా కాగితాల్లోనే మెట్రో రెండో దశ కారిడార్లు, వాటి అంచనాలు తారుమారవుతున్నాయే తప్ప క్షేత్ర స్థాయిలో పనులు నిర్వహించేందుకు అవసరమైన డీపీఆర్‌లు మాత్రం సిద్ధం కావడంలేదు. రెండోదశ డీపీఆర్‌ను జూన్ నాటికే తీసుకువస్తామని చెప్పిన రేవంత్ సర్కారు సెప్టెంబర్ గడుస్తున్నా ఇంకా సిద్ధం చేయించలేకపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్‌సిటీకి 40 కి.మీతో మెట్రో కారిడార్

ప్రస్తుతం హైదరాబాద్ మహానగరంలో కోర్ సిటీలోనే మెట్రో మార్గాలను పొడిగించాల్సిన అవసరం చాలా ఉంది. అయినా వాటన్నింటినీ పరిగణలోకి తీసుకోకుండా సీఎం రేవంత్ రెడ్డి కొత్తగా ప్రతిపాదిస్తున్న ఫోర్త్ సిటీకి మెట్రో కారిడార్‌ను నిర్మించాలని ప్రతిపాదించడంతో రెండో దశ డీపీఆర్‌ను రూపొందించడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. సుమారు 40 కి.మీ దూరంతో ఎయిర్‌పోర్టు నుంచి ఔటర్ రింగు రోడ్డు మీదుగా కొంగర కలాన్ ఇంటర్‌చేంజ్ వరకు అక్కడి నుంచి ఫోర్త్ సిటీలో శంకుస్థాపన చేసిన స్కిల్ యూనివర్సిటీ వరకు నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ రెండో దశ మెట్రో నిర్మాణాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో చేపడుతామని మెట్రో అధికారులు వెల్లడించారు.